క్లుప్తంగా

సన్మానం



నర్సంపేట : బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఈసీ మెంబర్‌గా ఎన్నికైన చెన్నారావుపేటకు చెందిన న్యాయవాది మర్రి రాజును చెన్నారావుపేటలో 1995 పదో తరగతి బ్యాచ్ మిత్రులు ఆదివారం పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజు స్నేహితులు కుండె కుమారస్వామి, దొంతి మంజుల, ముదురు రమేశ్, కలకోటి వీరభద్రయ్య, గోపు భూపాల్‌రెడ్డి, బొంత రవీందర్, కేశబోయిన నర్సింహరాములు ఉప్పుల వీరస్వామి, దొంతి సంతోశ్, వరంగంటి సంతోశ్, చెవ్వ రాజేంద్రప్రసాద్, కుసుమ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నల్లబెల్లి : మెపా జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని బొల్లోనిపల్లికి చెందిన పోలుదాసరి రామును నియమించినట్లు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడారు. రాజకీయకాలకు అతీతంగా విద్యా, ఉద్యోగ సాధికారత కోసం మెపా ముందుకు సాగుతుందని చెప్పారు. తన నియామకం కోసం కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాదుస్తుల పంపిణీ



నల్లబెల్లి : హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో జరుగనున్న రగ్బీ సీనియర్ మీట్‌లో పాల్గొననున్న 48 మంది క్రీడాకారులకు రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ సారంగపాణి ఆదివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ విషయంలో అసోషియేషన్ సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అసోషియేషన్ సెక్రటరీ మంగపల్లి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, హైదరాబాద్ అసోసియేషన్ సెక్రటరీ ఐత శ్రీకాంత్, వరంగల్ అసోసియేషన్ సెక్రటరీ ఉడుతల శ్రీకాంత్, కరీంనగర్ అసోసియేషన్ సెక్రెటరీ రంగు నిరంజన్ చారీ, తదితరులు పాల్గొన్నారు.

'సీఎంఆర్ఎఫ్' అందజేత



నల్లబెల్లి : మండలంలోని నారక్కపేటకు చెందిన సముద్రాల కొమురమ్మ కుటుంబానికి మంజూరైన రూ.51,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ ఆదివారం అందజేశారు. అనంతరం అశోక్ మాట్లాడారు. కొమురమ్మ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థికసాయం మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపతి సుమన్, పాగుల కుమారస్వామి, కేతే రాజేందర్, ఎంబడి కరుణాకర్, అడిచర్ల శ్రీనివాస్, బొడిగె సుమన్, కోడూరి రాజశేఖర్, కావటి గణేశ్, హుస్సేన్, కలిమి రాజశేఖర్, మాదుగుల చంద్రమౌళి, ఉప్పుల మహేశ్, గొట్టిముక్కుల శ్రీధర్, దండెం శంకర్‌లింగం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు నేడు, రేపు సెలవు

నర్సంపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు నేడు (సోమవారం), రేపు (మంగళవారం) సెలవు ప్రకటించినట్లు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా నేడు (సోమవారం), మంగళవారం వారంతపు సెలవు ఉంటుందని పేర్కొన్నారు. రైతులు నేడు, రేపు మార్కెట్‌కు సరుకులు తీసుకురావద్దని కోరారు. మార్కెట్ బుధవారం ప్రారంభం అవుతుందని వివరించారు.

'గ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోవాలి'

నర్సంపేట : గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకుడు జన్ను రమేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెన్నారావుపేటలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలపై భారాలు మోపుతూ ప్రభుత్వం వంట గ్యాస్ ధరల పెంపుతో పేద, మధ్య తరగతి ప్రజలపై తీరని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్, ఇతర నిత్యావసరాల ధరలను తగ్గించేంత వరకు పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు



సూరారం స్టేజీ సమీపం వద్ద ప్రమాదకరంగా ఉన్న బావి



జీల్గుల నుంచి పెంచికలపేటకు వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఉన్న బావి

- రోడ్డు సమీపంలో బావులు
- భయాందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

ఎల్కతుర్తి : ప్రధాన రహదారుల సమీపంలో భారీ ప్రమాదం పొంచి ఉంది. రహదారులను అనుకుని ఉన్న వ్యవసాయ బావుల చుట్టూరా పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. ఈ రహదారుల వెంట వెళ్లే వాహనదారులు ఏమాత్రం ఏమరపాటు వహించినా అనంతలోకాలకు దారితీసే ప్రమాదం ఉందని, రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు పలు రహదారుల వెంట ప్రయాణం కొనసాగించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం కొనసాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని అనుకుని రెండు వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. సూరారం స్టేజీ సమీపంలో, ఎస్సారెస్పీ కాల్వ సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు రక్షణ గోడలు లేకుండా ఉండడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. వల్బాపూర్ నుంచి దండేపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికిరువైపులా తొమ్మిది వ్యవసాయ బావులు ఏలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి కనిపించకుండా ఉన్నాయి. అలాగే జీల్గుల గ్రామం నుంచి పెంచికలపేట గ్రామానికి వెళ్లే బైపాస్ రహదారి వెంట మరో ఆరు వ్యవసాయ బావులు రోడ్డుకిరువైపులా ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. సింగిల్ రోడ్డు, మలుపులు, పక్కనే వ్యవసాయ బావులు రక్షణ గోడలు లేకుండా ఉండడంతో ప్రమాదకరంగా మారాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బావుపేట ఎక్స్ రోడ్డు నుంచి బావుపేట గ్రామం వరకు వెళ్లే ప్రధాన రహదారి వెంట మరో రెండు బావులు ప్రమాదకరంగా ఉండేవని దాంతో అర్ధరాత్రి ఓ ఆటో బావిలో పడిపోయిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యవసాయ బావుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రమాదాలు జరగకముందే స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలో ఏర్పడిన తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మిషన్ భగీరథ ప్లాంట్ గేటు ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 8 నెలలుగా గ్రామంలో తాగునీటి కొరత ఉందని, మిషన్ భగీరథ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వెనకాలఉన్న వాటర్ ట్యాంక్ నుంచి గ్రామంలో సుమారు 9 వార్డులకి తాగునీటి సరఫరా చేస్తున్న క్రమంలో మిషన్ భగీరథ అధికారులు ఈ ట్యాంక్‌కి డై ఏర్పాటు చేయడం వలన నీటి కొరత ఏర్పడిందని అన్నారు. ఆ డైని తొలగించాలని అధికారులను కోరినా స్పందించలేదన్నారు. ధర్మసాగర్ మేజర్ గ్రామ పంచాయతీ అని ఇక్కడి నుంచే ఇతర మండలాలకు, గ్రామాలకు తాగునీటి సరఫరా చేస్తున్న అధికారులకు మండల కేంద్రంలోని ప్రజలు కనిపిస్తలేరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామస్తులు బొడ్డు భరత్, కొలిపాక రమేశ్, కొలిపాక మల్లిక్, బొడ్డు రమణాకర్, విప్లవ్ కుమార్, వినేష్, ప్రభు, ప్రవీణ్, క్రాంతి రణదేవ్, తరుణ్, దీపక్, శరత్, రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

దశదిశతో భవిష్యత్ కార్యచరణ



పరకాల : మున్నూరుకాపు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జరిగిన దశదిశ సభకు ఆ సంఘం నాయకులు ఆదివారం తరలివెళ్లారు. దశదిశతో భవిష్యత్ కార్యచరణకు అవకాశం లభించిందని మున్నూరుకాపు సంఘం పరకాల నియోజకవర్గ కన్వీనర్ బొజ్జం రమేశ్, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి అన్నారు. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో జరిగిన మున్నూరుకాపు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ దశదిశ సభకు నియోజకవర్గంలోని వివిధ మండలాల బాధ్యులు తరలివెళ్లారు.

హౌసింగ్ శాఖకు పూర్వవైభవం

పరకాల : ఇందిరమ్మ ఇళ్ల పథకంతో హౌసింగ్ శాఖకు పూర్వవైభవం రానుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పనులను ముమ్మరం చేసేందుకు హౌసింగ్ శాఖ అధికారులు కసరత్తులు చేస్తున్నారు. అదే విధంగా తమ శాఖకు చెందిన శిథిలమైన కార్యాలయాలను, ప్రదేశాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటిని చదును చేసేందుకు పనులు ప్రారంభించారు. పరకాల డివిజన్ కేంద్రంలోని 973 సర్వే నంబర్ గల హౌజింగ్ శాఖ కార్యాలయ ఆవరణంలో నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పాత భవనాలు అధికారులు ఉండేందుకు అనుకూలంగా లేకపోవడంతో కొత్త భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ద్వారా చేపట్టారు. నెల రోజుల్లో కార్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం. దీంతో 15 ఏళ్లుగా అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా ఉన్న హౌసింగ్ కార్యాలయాలు అధికారులు, ఉద్యోగులు, లబ్ధిదారులతో సందడిగా మారనున్నాయి.



హౌసింగ్ శాఖ కార్యాలయ ఆవరణలో ప్రారంభమైన భవన పనులు

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



దామెర : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని పసరగొండకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కొటం మోహన్ కుమారుడు ఆయన్ష్, అదే గ్రామానికి చెందిన గజ్జి చిరంజీవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా విషయం తెలుసుకున్న ధర్మారెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాము, మాజీ సర్పంచ్ సాంబయ్య, సుధాకర్, అశోక్, రాజు ఉన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన గంకిడి సమ్మిరెడ్డి ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సమ్మిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

సిద్ధేశ్వర్ ఆమరణ దీక్షను విరమింపజేయాలి



మాట్లాడుతున్న మాదాసి సురేశ్

ఆత్మకూరు : బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ 13 రోజులుగా ఢిల్లీలో ఆమరణ దీక్ష చేస్తున్న బీసీ ఆజాది జేఏసీ చైర్మన్ బత్తుల సిద్ధేశ్వర్ దీక్షను విరమింపజేసి బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా కో చైర్మన్ మాదాసి సురేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని నాగయ్యపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆమరణ దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర్‌కు ఎలాంటి ఇబ్బంది కలిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే నైతిక బాధ్యతన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గిన్నారపు ప్రసంగి, మోరె అయిలయ్య, కొమ్మాల భిక్షపతియాదవ్, మాదాసి భిక్షపతి, సూరయ్య, కుమారస్వామి, బక్కయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోంది. దర్గాలో భక్తులు, ప్రజలకు నీరు సరఫరా చేసే బావి, కరెంటు మోటార్ల గదికి వెళ్లే దారిని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టారు. మండల పంచాయతీ అధికారి స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న అన్నారంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ కట్టడాలు చేపట్టినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూకబ్జాకు పాల్పడి అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై కేసు నమోదు చేసి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మొక్కజొన్న పంట క్షేత్రప్రదర్శన

దామెర : అధిక దిగుబడి ఏసీఎస్ఈఎన్ అగ్రిసైన్స్(హైవేజ్ (గ్రూప్)తో సాధ్యమని ఆ కంపెనీ డీబీఎం సురేశ్, ఏఎం విష్ణువర్ధన్ అన్నారు. మండంలోని దమ్మన్నపేట్‌లో అగ్రిసైన్స్ కంపెనీ ఏహెచ్‌సీ 3318 రకం మొక్కజొన్న పంటను రైతులతో కలిసి క్షేత్ర ప్రదర్శన చేశారు. మొక్కజొన్న సాగుచేసిన విధానాన్ని రైతు వివరించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఏహెచ్‌సీ 3318 రకం పంట మొక్క కింద పడకుండ బలంగా ఉంటుందని అన్నారు. అందుతెగులును సమర్థవంతంగా ఎదుర్కొని, గట్టి గింజలు పండుతాయని, దీంతో తూకం అధికంగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ సీడ్స్ యజమాని హింగె రవీందర్, దామెర, ఒగ్లాపూర్, ల్యాదెళ్ల, ఒగ్గోనిపల్లి, ఊరుగొండ, పసరగొండ రైతులు తదితరులు పాల్గొన్నారు.



దమ్మన్నపేటలో మొక్కజొన్న రైతును సన్మానిస్తున్న కంపెనీ ప్రతినిధులు

బీపీ మండల్‌కు నివాళి

నర్సంపేట : పట్టణంలోని బీసీ పవర్ కార్యాలయంలో ఆదివారం బిందేశ్వరి ప్రసాద్ (బీపీ) మండల్ 42వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మండల్ చిత్రపటానికి బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ నివాళులర్పించి మాట్లాడారు. మండల్ ఓబీసీల హక్కుల కోసం చారిత్రాత్మక పోరాటం చేపట్టారని కొనియాడారు.

ధార్మిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక చైతన్యం

ఆత్మకూరు : గ్రామాల్లో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ చేపట్టే ధార్మిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని ఆత్మకూరు శ్రీవేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా టీటీడీ హిందూ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో ఉపన్యాసాలు, భజనలు, కుంకుమ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం మాధవమూర్తి మాట్లాడుతూ.. గ్రామాల్లో టీటీడీ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. టీటీడీ ఉపన్యాసకులు ఎస్.శివప్రసాద్, టింగిలికారి సత్యనారాయణ, పరికిరాల వాసు, మునుకుంట్ల సతీశ్, పాపని రూపాదేవి, పుష్పలీల, జ్యోతి పాల్గొన్నారు.

మేకపోతుల ప్రభబండితో తరలిన నాయకులు

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లిలో జరగనున్న శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణానికి బీజేపీ నాయకులు మేకపోతుల ప్రభబండితో బయలుదేరి వెళ్లారు. జీడిగడ్డతండా గ్రామానికి చెందిన భూక్య హరీష్ ఇంటి నుంచి ప్రభ బండితో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సంగెం శంకర్, దుంకదువ్వ రంజిత్, విజయ్‌కుమార్‌రెడ్డి, సుమన్, చీకటి చిరంజీవి, బక్కతట్ల రవీందర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి'

పర్వతగిరి : సమాజంలోని ప్రతిఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ కోరారు. మండలంలోని ఏబీతండా, చింతనెక్కొండ, బట్టుతండా గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రచించిన రాజ్యాంగాన్ని సవరణ పేరుతో నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. అన్ని గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తామని చెప్పారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మాలోత్ రవి, ఓరుగంటి శ్రీనివాస్, చాంప్లా నాయక్, రాంచందర్‌రావు, సువార్త, సావిత్రి, బందెల వెంకన్న, దబ్బెట నర్సయ్య, నరుకుడు రవీందర్, భాస్కర్ నాయక్, మాసాని యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

తేజస్వినిరెడ్డిని సత్కరించిన మంత్రి, ఎమ్మెల్యేలు

శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన గ్రూప్–1లో స్టేట్ 4వ ర్యాంకర్ జిన్నా తేజస్విని రెడ్డిని ఆదివారం హనుమకొండలోని కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. గ్రూప్–1లో రాష్ట్రంలో 4 ర్యాంక్‌ను భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన తేజస్వినిరెడ్డి సాధించడం గర్వకారమణమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.



తేజస్వినిరెడ్డిని సత్కరిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, మేయర్, కలెక్టర్

పల్లెపల్లెకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



సంవిధాన్ యాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాయంపేట : డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పల్లెపల్లెకు పాదయాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగట్టు సింగారం, తహరాపూర్ గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, అంబేడ్కర్, రాజ్యాంగాన్ని గౌరవించుకుందామని ఏఐసీసీ ఆదేశాల మేరకు జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాని తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లా చక్రపాణి, పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మారెపల్లి రవీందర్, చిందం రవి, వైనాల కుమారస్వామి, కొమ్ముల భాస్కర్, నిమ్మల రమేశ్, డీటీ రెడ్డి, అబ్బు ప్రకాశ్‌రెడ్డి, రాజిరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

వేలేరు : జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లి జయప్రదం చేయాలని ప్రోగ్రాం కోఆర్డీనేటర్ కట్టా మనోజ్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజలకు చేస్తున్న సంక్షేమాభివృద్ధిని గడపగడపకు తీసుకువెళ్లి వారికి వివరించాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడంతోనే పాలనలో మార్పు రావాలని ప్రజలు కాంగ్రెస్‌కు ఓటువేసి గెలిపించారని అన్నారు. మండల అధ్యక్షుడు సంపత్, కాంగ్రెస్ నాయకులు సమ్మయ్య, యాదగిరి, సద్దాంహుస్సేన్, రాజిరెడ్డి, లక్ష్మణ్ నాయక్, రాంచందర్, సంపత్, సలీంమాలిక్, రాజేందర్ పాల్గొన్నారు.

సన్నబియ్యంతో సహపంక్తి భోజనం

ఐనవోలు : మండలంలోని పెరుమాండ్లగూడెనికి చెందిన రేషన్ లబ్ధిదారుడు పులిగిల్ల కుమారస్వామి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆదివారం ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ మాట్లాడుతూ.. దేశంలో తొలిసారిగా రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యం వలన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రేషన్ బియ్యాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్ రాయపురం సాంబయ్య, మండల నాయకులు పోలెపల్లి బుచ్చిరెడ్డి, ఇల్లందుల ఎలిషా, భాస్కర్, రవికుమార్, సాంబయ్య, సంపత్, వెంకన్న, మధు, శ్రీనివాస్, యాకయ్య, దయాకర్, రవి, రమేశ్ పాల్గొన్నారు.



రేషన్ లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కేంద్రం కృషి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

దామెర : డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం నీటితో శుద్ధిచేశారు. అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ 134వ జయతిని పురస్కరించుకుని ఈనెల 13 నుంచి 25వ తేదీ వరకు బీజేపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం మోదీ కృషిచేస్తూ, అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చే విధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, నాయకులు రతన్‌కుమార్, చంద్రకిరణ్, రమేశ్, సుధాకర్, సుమంత్, కొమురయ్య, మహేందర్, సాంబయ్య, శ్రీను, పృధ్వీరాజ్, సంతోశ్‌బాబు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధిచేస్తున్న ప్రేమేందర్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో చదువుకున్న 1999–2000 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు స్థానిక లక్ష్మీగణపతి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా 25 ఏళ్ల తర్వాత తమతో చిన్ననాట చదువుకున్న బాల్య మిత్రులను కలిసి ఆప్యాయంగా పలకరించుకుని యోగ, క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వయసు మరిచి మరొకసారి బాల్య స్మృతులను, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. చిన్ననాట తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సన్మానించారు. 25 ఏళ్ల తర్వాత తమను ఒక్కచోటకు చేర్చిన నిర్వాహకులకు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. అప్పటి గురువులు ప్రేమ్‌చందర్, సత్యప్రకాశ్, కుమారస్వామి, బాలరాజు, వెంకన్న, నిర్వాహకులు రాజు, మహేందర్, వసంతరావు, శ్రీరామ్, శ్రీకాంత్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మహ్మద్ హుస్సేన్ మృతి బాధాకరం

పరకాల : గుండెపోటుతో మృతిచెందిన మొగుళ్లపల్లి ఎంపీడీఓ ఎం.డీ మహమ్మద్ హుస్సేన్ కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. చిన్ననాటి స్నేహితుడు మహ్మద్ హుస్సేన్ ఆకస్మిక మరణం తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు. నాయకుడు రాంమూర్తి, విజయ్‌కుమార్ ఉన్నారు.